# ఆడమనసులు - మగమనిషి

# ఆడమనసులు మగమనిషి

'అరుణా! నీకు లెటరొచ్చింది', శ్రీమతిని పిల్చేడు సూర్యం.

తడి చేతులను చీరకొంగుకు తుడుచుకుంటూ "నా ముఖం నాకు ఉత్తరం యెక్కడినుంచి వస్తుందండీ?" అని ఉత్తరం చేతిలోకి గుంజుకుని చించి గబగబా చదివేసి పకపకా నవ్వేసింది అరుణ.

"అంతగా నవ్వేస్తున్నావు...ఏదైనా లవ్ లెటరా?" జోక్ చేశాడు.

"బాగానే వుంది మీ విట్టు" తల అదోరకంగా ఆడించింది.

"అదికాదు అరుణా! పెళ్ళి అయినవాళ్ళు ప్రేమించకూడదనే నిబంధన్లు ఏమీలేవు."

"ఆ పాటింపు మగవారి కుండేమో...అది సరే...ముందీ ఉత్తరం చదవండి"

'అరుణ అక్కకు,

నీకు నా ఆశీస్సులు! కాదు...కాదు...నమస్సులు!!— నువ్వు తల్లివి కాబోతున్నావని తెలిసింది.

ఆడపిల్లనే కను - బావగారి నింతవరకూ చూడలేదు. ఎలా వుంటారు?...

బావగారు గిరీశంలా వుంటారా? బి. సి. నాటి తెలుగు మాష్టారిలా వుంటారా??

ఇంతకూ విషయమేమిటంటే మద్రాసులో 'వరల్డు ఫేర్' జరుగుతోంది.

బావగారూ! నువ్వూ వెంటనే బయల్దేరి రండి—

రాధ.'

"అరుణా! ఎవరీరాధ? ఏమాకథ??" అర్థంకాక అడిగేను.

"కంగారు పడకండి. మనిషికూడా అంతకంటే కరుకుగా, చురుకుగా వుంటుంది. మెరుపులాటి మనిషి. తళుకులాటి మనసు...ఆఁ....ఇంతకూ ఏమంటారు??"

"ఏ విషయం?"

"మనం మద్రాసు వెళ్ళేవిషయం!"

"సారె! రేడికి లేచిందే పరుగా? అయినా మీ ఆడళ్ళతో ఏదొచ్చినా యింతే!...ఊపిరి సలుపనీరు...సరేకాని ...వెళ్ళిరా!"

"మీరూ రారూ?"

"నేనా? బాగానే వుంది! నేను ఏ అమ్మకన్న ఆడపిల్లనో అయినవారి అర్ధాంగినో అయితే నీకు మల్లే రెడీ అయ్యే

వాడిని. కానీ...ఖర్మ!...నాకు ఉద్యోగమంటూ ఒహటుంది. శలవు మంజూరవద్దూ?"

"మున్నూటఅరవైరెండు రోజులూ ఆఫీసుకు వెడుతునే వుంటారుగదా...మరి మీకుండే శలవులన్నీ పిల్లలు పెడతాయా ఏమిటండి?"

"ఆ...ఆ...ఆ ప్రశ్నే ఆఫీసరు నడిగితే నా బోటి బొడ్డూడని గుమాస్తాగాడికి అయిదోతనం లేకుండా చేస్తాడు."

"అంత భయపడుతూ ఉద్యోగం చెయ్యకపోతే నేం?"

"అబ్బా! ఎంత తేలిగ్గా అన్నావ్. పోనీ మీ వాళ్ళు సంపాదించి వెనకేసిన 'నల్లడబ్బే'దైనా వుంటే పట్రా, పౌరుషంగా వ్యాపారమేదైనా చేద్దాం!"

"మీ వేళాకోళానికేం గాని...భోజనానికి లేవండి. మీ ఆఫీసు టైమవుతోంది" అనేసి యింట్లో కెళ్ళింది.

* * *

రైలు సెంట్రల్లో ఆగింది.

అరుణ కంపార్టుమెంటులోంచి దిగటం చూచిన రాధ "హలో...వచ్చేశావే!" అనేసింది ఆనందంతో.

పెట్టె, బెడ్డింగు, ఫ్లాస్కు, మరచెంబు వగైరా వగైరా అన్నీ వచ్చాయో లేదో అని లెక్కచూస్తున్నాడు సూర్యం.

"అక్కా! బావగారు రాలేదా?" దిక్కులు చూస్తూ అడిగింది రాధ.

సూర్యం రాధ కళ్ళల్లోకి చూసి తనే బావనన్నట్టు నవ్వేడు.

రాధను ఆపాదమస్తకం పరీక్షించేసరికి సూర్యం ఒంట్లో

నరాలు స్థంభించాయి. హాలీవుడ్లో సోఫియాలారెన్‌ను చూచినట్లు, స్వర్గంలో రంభను చూచినట్లు అన్పించింది.

ముగ్గురూ టాక్సీలో ఇంటికి బయల్దేరారు.

పెళ్ళికి రాలేకపోయినందుకు క్షమాపణ చెప్పుకుంటోంది రాధ అరుణతో. రాధా బాధితుడు ఫ్రంటుసీట్లో కూర్చోవటంవల్ల వారి ముచ్చట్లల్లో పాలు పంచుకునేందుకు వీల్లేకుండా పోయింది.

ఇంట్లో వాళ్ళ మర్యాదలు చూస్తుంటే మతిపోతోంది సూర్యానికి. అప్టుడేటు ఫర్నిచరు, ఫాన్లు, ఫోను, రేడియో ఇంకా బోలెడు మోడరన్ స్టయిల్లోవుంది ఇల్లు.

మేడమీద గది ప్రత్యేకంగా సూర్యం దంపతులకు కేటాయించారు.

ప్రతి పదినిముషాలకీ ఇంట్లోవారి పరామర్శ చూస్తూ వుంటే సూర్యానికి సిగ్గేస్తోంది.

ఇంట్లోనే కేరమ్సు, ఛస్సు, మేగజేన్సు ఇంకా ఎన్నో వున్నాయి కాలక్షేపానికి.

రాధ పలకరించినప్పుడల్లా 'అవును - కాదు' అనేసి మాత్రమే చిలకలాగ సమాధానమిస్తున్నాడు సూర్యం.

* * *

ఉదయం ఎనిమిది కావస్తోంది.

సూర్యానికి మేలుకొలుపు పాడుతోంది అరుణ.

రాధ కాఫీకప్పుతో గదిలోకొచ్చింది. "అక్కా! బావగారు కుంభకర్ణుడి బ్రదర్లా వున్నారే!" అనకుండా వుండలేకపోయింది.

రాధ సూర్యాన్ని హేళనచేయటం ఇది యిరవయ్యో సారి. దెబ్బతిన్నాడు సూర్యం. తను కిక్కురుమనకుండా ఊరుకోవడం సమంజసంగా తోచలేదు. తిరుగుదెబ్బ కొడదా మంటే పక్కనేవున్న శ్రీమతి ఏమనుకుంటుందోనని నోరు నొక్కుకోవలసి వచ్చింది.

కాలకృత్యాలు పూర్తిచేసేసరికి తొమ్మిది దాటింది. సూర్యం న్యూస్ పేపరు తిరగేస్తున్నాడు. అరుణ 'ఊలు'తో పుట్టబోయే బాబుకు స్వెట్టరు కుడుతోంది.

"అక్కా! కాస్సేపు పేకాడుకుందాం" అంది గదిలో కొచ్చిన రాధ.

'నే రెడీ' అన్నట్టు చదువుతున్న పేపరు పక్కన పెట్టాడు సూర్యం.

'సరే మొదలెట్టండి' అన్నట్టు రాధవేపు చూసింది అరుణ.

పేక కలుపుతున్న రాధ సూర్యం ముఖంలోకి చూచి, "అక్కా! బావగారు అచ్చు 'రాక్ హడ్సన్'లా వున్నారు. ఇంతోటి అందం నీకు అందటం నీ అదృష్టం అక్కా!" చెణుకు విసిరింది.

"మీ అక్కను చేసుకోకపూర్వం నీలాంటి 'ఎలిజబెత్ టైలర్' నాకళ్ళ బడ్లేదు" అనేశాడు చటుక్కున. తర్వాత తన తొందరపాటుకు నాలుక్కర్చుకున్నాడు.

"ఊం... బావగారు ప్రవరాఖ్యులేమో అనుకున్నాను. మంచి సరసులే!"

అంతకుమించి సంభాషణ పొడిగిస్తే అరుణ మనసు

నొచ్చుకో వచ్చునిపించటంతో మారు మాట్లాడలేదు సూర్యం.

ముగ్గురూ నవ్వుకున్నారు.

"అక్కా! సాయంత్రం సినీమా కెడదాం, ఏం?"

"నే నెందుకు రాధా!"

"అవును రాధా! మీ అక్కను బలవంత పెట్టకు. అసలే లేవలేని మనిషి కూడాను" ఇంకా యేదో చెప్పబోయాడు.

"అక్క రాకపోతే అసలు ప్రోగ్రామే కేన్సిలుచేద్దాం" అలిగింది రాధ.

ఒకరి ముఖాలొకరు చూచుకున్నారు.

సాయంత్రం ముగ్గురూ టాక్సీలో థియేటరు చేరుకున్నారు.

సూర్యాని కిరువైపులా రాధ, అరుణ కూర్చున్నారు. రాధ 'చిప్సు' కొన్నది. అరుణ 'పాప్ కారన్' కొంది. సూర్యం చంటిపిల్లాడిలాగ 'చాక్లెటు' కొన్నాడు. రాధ నవ్వింది.

సినిమా ఆరంభమైంది.

ఇంగ్లీషు పిక్చరు కావటంలో ముగ్గురు మాంఛి మూడ్సులో సినీమా చూడటంలో లీనమయ్యారు.

ప్రతి అయిదు నిముషాలకీ రాధ ఏదో కామెంటు చేస్తూనేవుంది. ప్రతి పదినిముషాలకు సూర్యం ముఖంలోకి చూచి నవ్వుతోంది.

భార్య ప్రక్కనే వుందనే భయం ఓ వేపు, రాధ

కంపెనీ హేపీగా స్పెండ్ చేయలేకపోతున్నాడనే బాధ మరో వేపు.

అరుణ తనవేపు క్రీగంటి చూపులు చీకట్లో విసురుతుంటే తగు జాగ్రత్త వహిస్తూ గమనిస్తూనే వున్నాడు సూర్యం.

రాధ కాళ్ళు తన కాళ్ళను గీరటం, రాధ చేతులు తన చేతులకు తగలటం చూస్తూ తనను తాను నిగ్రహించుకోనటం తప్ప మరేమీ చెయ్యలేక పోతున్నాడు.

గంటన్నర సినీమా పది నిమిషాల్లోనే అయిపోయిందేమో అన్పించింది సూర్యానికి.

ముగ్గురూ ఇల్లు చేరుకున్నారు.

రాధ సౌందర్యం, సౌజన్యం...ఇత్యాదులే మనసులో మెదులుతున్నాయి సూర్యానికి. ఆమె మనస్తత్వ మెలాంటిదో అర్థంకాక సతమత మవుతున్నాడు.

కైపెక్కించే కళ్ళు, కసిగా వుండే చూపులు, మత్తెక్కించే మాటలు సూర్యాన్ని ఇహంలోంచి పరంలోకి ప్రయాణం కట్టిస్తున్నాయి.

కళ్ళు రెండూ గట్టిగా మూసుకుని నిద్రలోకి జారబడ్డాడు.

* * *

బద్ధకంగా తెల్లవారింది.

తొమ్మిది కొట్టేసరికి రాధ కాఫీకప్పుతో సూర్యం గదిలో తయారైంది మళ్ళీ.

పేపరు చదువుతున్న సూర్యాన్ని చూస్తూ, "బావ గారూ కాఫీ! సెకండ్ డోస్ ప్లీజ్!!" అంది.

అరకప్పు కాఫీని ఆర్చుకు ఆర్చుకు తాగకుండా రాధ కళ్ళల్లోకి తీక్షణంగా చూస్తూ అర్ధ సెకండులో తాగేశాడు.

"ఏమిటట్లా చూస్తున్నారు" రాధ ప్రశ్న.

'నీ అందాన్ని! కళ్ళల్లో యిమిడి వున్న ఆనందాన్ని!' అనేద్దామనుకున్నాడు కానీ నోరు పెగల్లేదు.

"రాధా! మీ అక్కేది?" అడిగాడు మామూలు ధోరణిలో.

"అక్కా, అమ్మా కలిసి బజారుకెళ్ళారు-ఏదో కొనాలట" ఎటో చూస్తూ అంది.

"అందుకేనా ప్రొద్దుటే నామీద యుద్ధానికి బయల్దేరింది!"

"యదార్ధానికంతే... బావగారూ?"

"ఆఁ" అన్నాడు మరో లోకంలో విహరిస్తున్న మనసును కళ్ళెమేసి వెనక్కులాగి.

గదిలో గుండ్రంగా తిరుగుతూ, కిటికీలోంచి బైటికి చూస్తూ, "నే నందంగా వున్నానా బావగారూ!" ఏడిపించాలని అన్నది రాధ.

"నువ్వా? నీకేం..."

"అంతా అబద్ధం!!"

"నిజం రాధా!" నేను కవిని కాదుగాని...లేకపోతే నీ అందంమీద కావ్యం వ్రాసి ఇచ్చేవాడిని."

"చాలు బావా! చాలు!!"

"ఏం?-?"

"మరేంలేదు. నన్ను అనవసరంగా పొగడి మునగ చెట్టు ఎక్కిస్తున్నారు. ఈ మాటలు అక్కవింటే నిన్ను పిచ్చాసుపత్రికి పంపుతుంది"

"నిన్ను చూస్తూ...నీతో మాట్లాడుతుంటే నాకు నిజంగా పిచ్చెక్కుతోంది"...

"అయ్యా కవిగారూ! - మా బావగారూ!! మీరు అనవసరంగా భావలహరిలో తేలిపోయి మా ప్రాణం తియ్యకండి. సాయంత్రం మనమంతా కలిసి వరల్డు ఫేర్ చూచేందు కెళ్ళాలి. అది చెబుదామని వచ్చాను. ఇక వెడతా" వెనక్కు తిరిగి వెళ్ళబోయింది.

సూర్యం నెత్తురు వుడికిపోయింది.

రాధ బుజాలను వెనుకనుండి పొదివి పట్టుకుని బలంగా తన కేసి తిప్పుకున్నాడు.

బిత్తరబోయింది రాధ.

రాధ ముఖంలోకి చూడలేకపోయాడు సూర్యం.

'నేను అందరిలాంటి మనిషిని కాదా బావా? మంచి మనసుతో స్వతంత్రంగా నీతో చొరవగా వుంటున్నంత మాత్రాన రాధ పసిహృదయాన్ని మసి చేస్తావా? - నీ పశుత్వానికి బలిచేస్తావా?-నన్ను ఆనందించు బావా...కాదు... కాదు...నీ అమానుష చర్యలకు నన్ను బలితీసుకో...' అని ఇంకా ఏవేవో భావాలు రాధ చూపుల్లో నిండిన కన్నీటిలో చూడగలిగేడు సూర్యం.

సూర్యం చేతులు నరికినట్టనిపించింది.

అప్రయత్నంగా రాధ భుజాలమీద వున్న రెండు చేతులు పడిపోయినయి—

గబగబా వెళ్ళిపోయింది రాధ.

తన బలహీనతకు తనను తానే తిట్టుకున్నాడు.

ఈ విషయం అరుణకు తెలిస్తే?

మళ్ళీ తన పాపిష్టి ముఖాన్ని రాధ కేవిధంగా చూపించగలడు? - మామూలు మనిషిలా రాధ తనతో మళ్ళీ మాట్లాడుతుందా?—

ఆలోచనల్లతో తల బ్రద్దలవుతోంది. సిగరెట్ వెలిగించాడు.

'వరల్డు ఫేరు' చూచేందుకు బైటికి బయల్దేరే ప్రయత్నంలోవున్న సూర్యం గదిలో డ్రస్ చేసికుంటున్నాడు.

కాఫీ కప్పుతో గదిలోకివచ్చింది రాధ.

"త్వరగా తయారవండి బావగారూ! అబ్బ...మీరు ఆడవారికంటే మరీ ఆలస్యం!!" కాఫీ అందిస్తూ అంది.

తలెత్తి రాధ ముఖంలోకి చూడలేకపోయాడు. తప్పు చేసినవాడిలా ఫీలవుతూ సిగ్గుపడ్తున్నాడు.

"రాధా! నన్ను క్షమిస్తావా?" హీన స్వరంతో గొణిగేడు కాఫీకప్పు చేతులోకి తీసుకుని మెటో చూస్తూ...

"ఛ!...అవేం మాటలు...నువ్వు మంచి మనిషివి బావా..." అనేసి నవ్వుతూ వెళ్ళిపోయింది.

'ఎంత మంచి మనసు రాధా నీది...' అనుకున్నాడు సూర్యం.

సూర్యం, అరుణ, రాధ ముగ్గురూ 'ఫేర్ గ్రౌండ్సు' కు అయిదుగంటలవ్వే సరికి చేరుకున్నారు.

పుట్టబోయే పాపకోసం ఆట వస్తువులు కొన్నాడు

సూర్యం అరుణ మంచి చీరె ఖరీదు చేసింది. రాధ క్రొత్త మోడలు హైహీలు షూ కొన్నది.

అలా అలా నడుచుకుంటూ చీకటి పడేసరికి 'జయంట్ వీల్' రంగుల రాట్నం దగ్గరకొచ్చారు.

దీపాలు వెలిగాయి - రకరకాల దీపకాంతులతో ప్రదేశమంతా భూతల స్వర్గంలా ఉంది.

"అరుణా! రంగులరాట్నం యెక్కుదామా?-" అడిగేడు సూర్యం.

"అమ్మో!...కళ్ళు తిరుగుతయ్...నాకు భయం బాబూ!!"

"రాధా! మరి నువ్వో?"

"నే రెడీ!"

రాధా, సూర్యం యిద్దరూ ఒకే తొట్టిలో కూర్చున్నారు. వీల్ తిరగనారంభించింది.

ఒక రౌండు పైకివెళ్ళి క్రింది కొచ్చేసరికి భూమి తల్లక్రిందులుగా తిరుగుతున్నట్లనిపించింది. అంత యెత్తుకు వెడుతుంటే రాకెట్లో కూర్చుని చంద్రమండలంలోకి వెడుతున్నట్లనిపించింది.

రాధకు భయంవేయటంతో కళ్ళు రెండూ గట్టిగా మూసుకొని సూర్యం వడిలో తల పెట్టుకుంది.

రాధ పసితనానికి, అమాయకత్వానికీ నవ్వుకున్నాడు సూర్యం.

మూడురౌండ్లు అయ్యాక యిద్దరూ క్రిందికి దిగేరు.

"అక్కా! అందులో కూర్చుని అలా పైకి వెళ్ళి

క్రిందకు వస్తుంటే యెంత హాయిగా వుందనుకున్నావు... నువ్వూ ఒకసారి యెక్కి చూడవూ?"

"వద్దులే రాధా! మీరు తిరిగొచ్చారుగా...చాలు!! ఇక వెడదాం పదండి!!" అరుణ సమాధానం చురుకుగావుంది.

"పోన్లే రాధా! మీ అక్క యెప్పుడూ అంతే!!"

"అప్పుడే ఇంటికా...ఇంకా చూడాల్సిన వెన్నో వున్నయి!! మనం సగమయినా చూడలేదు."

"నేనిక నడవలేను. అలసటగా వుందమ్మా!"

"అక్కా! నువ్విక్కడే వుండు. నేనూ బావా ఒక్క సారి అన్నీ చూసివస్తాం!"

కాదనలేక పోయింది అరుణ.

అరుణ ఆడ మనసులో విచిత్రమయిన ఆలోచనలు అల్లుకున్నయి?! రాధ ధోరణి, ప్రవర్తన, అర్థం కాకుండా వుంది. ఒక్కోసారి మనసుకు బాధనిస్తున్నప్పటికీ సర్దుకోక తప్పటంలేదు. ఏమిటీ స్వతంత్రం? - పెళ్ళిగాని ఆడపిల్ల... యెంత చదువు, సంస్కారం వుంటే మాత్రం...తన కళ్ళ యెదుటే భర్తతో?...ఛ! ఛ!! రాధ మీద అనవసరమైన అభాండం వేసి మరోవిధంగా అపార్థం చేసుకోవటం తప్పుగా తోచింది.

ఇంక ఎన్నో ఆలోచనలు కృంగదీస్తున్నయి—

సూర్యం, రాధా నవ్వుకుంటూ వచ్చారు.

"చూడటమంతా అయినట్లేనా? ఇంకేమయినా మిగిలి వుందా??" అరుణ మాటల్లో యెత్తిపొడుపు, కోపం, విసుగు, బాధ యింకా యెన్నో అర్థాలు ధ్వనించినట్లు సూర్యం అర్థం చేసుకోగలిగాడు.

"అట్లా వున్నావేం అరూ? వంట్లో బాగోలేదా?" మాట మారుస్తూ పరామర్శగా అడిగాడు సూర్యం.

"మీ కెంతసేకీ ముందు చూపేగాని... వెనకాలోచన లేదు. ఇవతల మనుష్యులు చస్తున్నారని కూడా అర్థంకాదు."

"ఏంటక్కా? ఏమయింది??" రాధ కేమీ అర్థంకాలేదు.

"సర్లే అరూ... ఇక ఇంటి కెడదాం పద!" సమాధాన పర్చాడు సూర్యం.

ముగ్గురూ ఇల్లు చెరుకునేసరికి పదిగంటలు దాటింది.

భోజనంచేసి గదిలో మేడమీద పడుకుని సిగరెట్ వెలిగించాడు సూర్యం.

అరుణ ముఖంలో రంగులు మారటం, మనిషి విసుగ్గా విసురుగా వుండటం గమనిస్తూనే వున్నాడు.

"కోపంగా వున్నావేం అరూ?"

ముఖం పక్కకు తిప్పుకుంది.

"అరూ! యెందుకట్లా వున్నావ్?!"

"ఎందుకా? మీరు చేస్తున్న పన్లకు?!" విసురుగా అంది.

"ఏమిటె నువ్వనేది!"

"ఏమిటా?!- పెళ్ళిగాని ఆడపిల్ల - దాని కెట్లాగూ తెలీదు...ఏదైనా కాస్త వెనక, ముందు ఆలోచించక్క ర్లేదూ??"

"నీ కేమైనా మతిపోయిందా?-"

"సరదాలకు, సరసాలకూ అంతూ పంతూ వుండద్దూ! రాధ అవుపించేసరికి మీ కళ్ళు కుట్టాయి. మిమ్మల్ని మీరు

మర్చిపోయారు - మొన్న సినీమాహాల్లో మీ భాగవతం నేను చూడలేదనుకున్నారు. ఇందాక మటుకు ఇందాక, ఇద్దరూ రంగులరాట్నం వంకతో ఒకే తొట్లో కూర్చోటం! మీ ఒడిలో అది తలవాల్చటం!...అవ్వ!! ఇవతల నేనున్నా నని కూడా లెక్కలేదు."

"ఏమిటా మాటలు అరూ! ఎందుకలా రాధను ఆడి పోసుకుంటావ్?"

"ఏం! పాపం!...దానికి వత్తాసొస్తున్నారా!!"

"అర్థంలేని స్వార్థంతో నువ్వనే మాటలు రాధ వింటే ఆ అమాయక హృదయం యెంత బాధపడ్తుందో తెలుసా?"

"నిజం అంటే బాధ దేనికి..."

"ఛీ!! నువ్వు ఆడదానివి కాదూ?! - సాటి ఆడపిల్ల సహృదయాన్ని అర్థంచేసుకోలేని నువ్వు మనిషివి కాదు... నీకు తెలీదు అరూ! రాధకు వయస్సు పెరిగిందేగాని మనసు పెరగలేదు. ఆలోచన్లు పెరగలేదు. రాధ ఇంకా నా దృష్టిలో చిన్నపిల్లే! అంచేతనే యెంతో అమాయకంగా, ఆప్యాయంగా పసిపిల్లలా ప్రవర్తిస్తోంది - నువ్వు చెప్పినవన్నీ నిజమే! కానీ అలా చేయటం వెనకాల రాధకు యెలాంటి దురుద్దేశ్యం గాని, దురాలోచనగాని లేదు - మనిషివేగాని రాధ మనసును ఆడదానివై యుండికూడా నువ్వు అర్థం చేసుకోలేక పోయావ్..."

"మీ రూరుకోండి. నా కంతా తెలుసు. మిమ్మల్ని చూచిన క్షణంనుండీ అది కళ్ళల్లో నిప్పులు పోసుకుంటూనే వుంది. అదే నా స్వంతచెల్లే గనుకైతే..."

"తప్పు అరుణా! అమాయకురాలిపై అభాండంవేసి వెళ్ళిపోవటం మనకు మంచిదికాదు అరూ!"

అంతవరకూ తలుపు ప్రక్కనేవుండి సంభాషణ వింటున్న రాధ లోపలికొచ్చి, "క్షమించక్కా! నేనే నీ తోబుట్టువునై వుంటే కొట్టి కసితీర్చుకునేదానివి - ఇప్పుడు మాత్రం ఏం తక్కువ...అయినా తప్పంతా నాది. ఎప్పుడో ఒకప్పుడు ఒక ఊళ్ళోవుండి ఒక క్లాసులోనే చదువుకున్న మనిద్దరిమధ్యా ఇంతటి మమకారం దేనికుండాలి? అంతా నా పిచ్చి, నా తెలివితక్కువ తనం! ఎంతో ప్రేమతో నిన్ను రమ్మని ఆహ్వానించాను. నీ హృదయం గాయపర్చి పంపుతున్నాను - ఇప్పుడు తెలుసుకో గలిగేను. నన్ను మనస్ఫూర్తిగా క్షమించు అక్కా!" అనేసి రివ్వున మేడమెట్లుదిగి వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్ళిపోయింది.